క్లుప్తంగా...

గర్భిణులకు సామూహిక సీమంతాలు

నాంపల్లి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నాంపల్లి నియోజకవర్గం రెడ్‌హిల్స్ డివిజన్‌లోని వీర్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచరు టి.యశోద నేతృత్వంలో కార్యక్రమం జరిగింది.

ముగిసిన బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు

లంగర్‌హౌస్: బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవాలు అంగరంగ వైభవంగా ముగిసాయి. తెలంగాణ బోనాల ప్రారంభం రోజు గోల్కొండ జగదాంబిక అమ్మవారికి పట్టు వస్త్రాల యాత్ర ప్రారంభించి, ప్రముఖులు మొదటి పూజ నిర్వహించేది లంగర్‌హౌస్‌లోని బుజిలీ మహంకాళి ఆలయం. ఈ ప్రధాన ఆలయం వద్ద దాదాపు 30 సంవత్సరాలుగా రంగం కార్యక్రమంలో భవిష్యవాణిలో బొడ్రాయి ప్రతిష్ఠాపన జరగాలని చెబుతూ వచ్చారు. ఇన్నాళ్లకు బొడ్రాయి ఏర్పాటు కార్యక్రమాలు పూర్తి కావడంతో లంగర్‌హౌస్‌లోని ప్రజలు ఆనందాలతో ఈ ఉత్సవాల్లో పెద్దయెత్తున పాల్గొన్నారు. బంధు మిత్రులతో తరలివచ్చి బొడ్రాయికి, బుజిలి మహంకాళి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాల్లో వివిధ బస్తీల పెద్దలు, భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అర్ధరాత్రి వరకు గాయకుడు గౌతం బృందం పాటలతో అలరించగా భక్తులు నృత్యాలు చేస్తు ఆడిపాడారు.

దివ్యాంగులకు చేయూత

గోల్కొండ: దివ్యాంగులకు తమ సంస్థ చేయూత నిస్తుందని ఎస్ఎంసీ డెవలపర్స్ మేనేజింగ్ డైరెక్టర్ అబ్దుల్ సలాం అన్నారు. వికలాంగుల సంక్షేమ సంఘం గ్రేటర్ అధ్యక్షుడు జాహెద్ అలీ బుధవారం టోలిచౌకి అక్బర్‌పురాలో అబ్దుల్ సలాంను కలిశారు. ఎస్ఎంసీ కంపెనీలో స్థానిక యువతకు ఉపాధి కల్పిస్తున్న అబ్దుల్ సలాంను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా అబ్దుల్ సలాం మాట్లాడుతూ... తాము దశాబ్ద కాలంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కోవిడ్ కష్ట కాలంలో తాము టోలిచౌకి, గుడిమల్కాపూర్, గోల్కొండ తదితర ప్రాంతాలలోని లేబర్ అడ్డాల వద్ద వలస కూలీలకు నిత్యావసరాలు అందించడంతో పాటు వారు స్వరాష్ట్రాలకు తిరిగివెళ్లే వరకు వారి వెంట ఉన్నామన్నారు.

గుడిమల్కాపూర్‌లో ఆలయాల అభివృద్ధికి కృషి

గోల్కొండ: గుడిమల్కాపూర్ డివిజన్‌లోని ఆలయాల అభివృద్ధికి స్థానికుల సహకారంతో కృషి చేస్తానని బీజేపీ నాయకుడు దేవర వంశీ అన్నారు. బుధవారం ఆయన బాంజవాడిలోని శివాలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దివంగత దేవర కరుణాకర్ గుడిమల్కాపూర్, కార్వాన్ తదితర ప్రాంతాల్లోని ఆలయాల అభివృద్ధి, పునరుద్ధరణ కోసం ఎంతగానో కృషి చేశారన్నారు. దానిని ముమ్ముందు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో రాధాకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అలనాటి నటుడు కాంతారావుకు నివాళి



వేడుకలను ప్రారంభిస్తున్న జస్టిస్ నాగేష్

నాంపల్లి: సిద్దేంద్ర ఆర్ట్స్ అకాడమీ 41వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ప్రముఖ చలన చిత్ర నటులు టి.ఎల్.కాంతారావు శత జయంతి మహోత్సవం వేడుకలను మంగళవారం రాత్రి నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళా మందిరంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగేష్ భీమపాక వేడుకలను ప్రారంభించారు. సిద్దేంద్ర ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షురాలు డాక్టర్ దేవసేన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సినీ సంగీత విభావరి, కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది.

క్రీడలతో మానసిక ఉల్లాసం



అబిడ్స్: క్రీడలతో మానసిక ఉల్లాసం చేకూరుతుందని బీఆర్ఎస్ గోషామహల్ నియోజకవర్గ నాయకుడు ఆశీష్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ క్రీడల్లో రాణించే విధంగా కృషి చేయాలన్నారు. కుడా స్టేడియంలో జరుగుతున్న జైభీమ్-2 క్రికెట్ పోటీలలో ఆయన పాల్గొని ప్రసంగించారు. క్రీడారంగానికి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందన్నారు. గోషామహల్ నియోజకవర్గంలో క్రీడాకారుల అభివృద్ధికి, సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

చేప ప్రసాదం పంపిణీకి భారీ బందోబస్తు

- వెయ్యి మంది పోలీసులతో బందోబస్తు పర్యవేక్షణ
- సీసీ కెమెరాలతో పటిష్ట నిఘా
- సెంట్రల్ జోన్ డీసీపీ వెంకటేశ్వర్లు



ఎం.వెంకటేశ్వర్లు, సెంట్రల్ జోన్ డీసీపీ

అబిడ్స్: ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో చేప ప్రసాదం పంపిణీకి భారీ ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు సెంట్రల్ జోన్ డీసీపీ ఎం.వెంకటేశ్వర్లు వెల్లడించారు. జూన్ 9వ తేదీ శుక్రవారం ఉదయం బత్తిని కుటుంబ సభ్యులు ప్రారంభించే చేప ప్రసాదం పంపిణీకి సంబంధించిన బందోబస్తు ఏర్పాట్లను డీసీపీ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎగ్జిబిషన్ గ్రౌండ్ పరిసరాలు, ఎగ్జిబిషన్ నలుమూలలా 715 మంది నగర పోలీసులతో పాటు 10 ప్లటూన్ల పురుష విభాగం పోలీసులు, 4 ప్లటూన్ల మహిళా విభాగం పోలీసులచే బందోబస్తు చేపడుతున్నట్లు తెలిపారు.

- ఈ నెల 8వ తేదీ నుంచి జూన్ 10వ తేదీ వరకు మూడు షిఫ్టుల మాదిరిగా పోలీసు బందోబస్తు నిర్వహిస్తామన్నారు. క్రైమ్ పోలీసులు, మఫ్టీలో పోలీసులను ఉంచి నిఘా ముమ్మరం చేస్తామన్నారు. ప్రజా సౌకర్యార్థం ఎగ్జిబిషన్‌లో పోలీస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. చైన్ స్నాచింగ్‌లు, ఎలాంటి దొంగతనాలు జరగకుండా, మహిళా పోలీసులు, మఫ్టీ పోలీసులు మూడు రోజుల పాటు బందోబస్తులో ఉంటారన్నారు.
- అజాంతగేట్, గాంధీభవన్ గేట్, వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ గేట్, మాలకుంట గేట్లవద్ద నాలుగు మెటల్ డిటెక్టర్లను ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరినీ తనిఖీలు చేసిన ద్వారానే లోపలికి అనుమతిస్తామని డీసీపీ స్పష్టం చేశారు.

సీసీ కెమెరాల ద్వారా నిరంతర నిఘా...

- ఎగ్జిబిషన్ లోపల, ఎగ్జిబిషన్ పరిసరాల్లో 75 సీసీ కెమెరాల ద్వారా బందోబస్తును పర్యవేక్షిస్తామని డీసీపీ వెంకటేశ్వర్లు వివరించారు. కొంతమంది సిబ్బంది సీసీ కెమెరాల ద్వారా నిఘాతో బందోబస్తు చేస్తామన్నారు. గురువారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు మూడురోజుల పాటు పోలీసుల పర్యవేక్షణలో ఎగ్జిబిషన్ గ్రౌండ్ ఉంటుందన్నారు.
- బత్తిని కుటుంబ సభ్యులకు స్వచ్ఛంద సంస్థలు, పలు అసోసియేషన్లు ప్రజలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. స్థానికులు, ఇతర ప్రాంతాల ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా పోలీస్ కంట్రోల్ 100 లేదా స్థానిక పోలీస్ కంట్రోల్ రూమ్‌లో ఫిర్యాదు చేస్తే వెంటనే సమస్యను పరిష్కరిస్తామని డీసీపీ స్పష్టం చేశారు.

నేడు ఉచితంగా ఆహార పదార్థాలు

చార్మినార్: మృగశిర కార్తె సందర్భంగా ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఈసారి పంపిణీ చేయనున్న చేప ప్రసాదం కోసం వచ్చే ప్రజల సౌకర్యార్థం ఈ నెల 8వ తేదీన ఉచితంగా ఆహార పదార్థాలను అందజేయనున్నట్లు టీఎస్ బసవ కేంద్రం వ్యవస్థాపక అధ్యక్షుడు నాగ్‌నాథ్ మాశెట్టి తెలిపారు. ఈ నెల 9వ తేదీన పంపిణీ చేయనున్న చేప ప్రసాదం కోసం రెండు రోజులకు ముందుగానే ఇతర రాష్ట్రాల నుంచి ప్రజలు నగరంలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు పెద్ద ఎత్తున వస్తారని.. వీరికి ఉచితంగా



ఆహార పదార్థాలను అందజేస్తున్నామన్నారు. ప్రతి ఏడాది లాగే ఈసారి కూడా ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో చేప ప్రసాదం పంపిణీ కోసం ఒక రోజు ముందుగా టీ, టిఫిన్‌లతో పాటు మధ్యాహ్నం భోజనం అందజేయనున్నామన్నారు. ఉచితంగా పంపిణీ చేయనున్న అన్నదానం ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



అధికారులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎర్మని కైలాష్ గంగపుత్ర

గౌలిపురా: ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీశ్రీశ్రీ మహంకాళి మాతేశ్వరి భారతమాత ఆలయం, శ్రీ కోట మైసమ్మ ఆలయాన్ని జీహెచ్ఎంసీ ఈఈ యు.బసవరాజు, డీఈ దేవేందర్, ఏఈ రవిచంద్, కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మీ సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎర్మని కైలాష్ గంగపుత్ర, ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షులు ఆలే భాస్కర్ రాజ్ ఘనంగా సన్మానించారు. సలహాదారులు ఎం.మల్లేషం గౌడ్, ఆనంద్, మధుసూదన్ గిరి, ఇ.సుమన్ కుమార్ ముదిరాజ్, బి.వై.శ్రీకాంత్, దల్లు శివ, అశోక్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం...

దేవాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో అధ్యక్షుడు ఎర్మని కై లాష్ కార్యవర్గాన్ని పూర్తిస్థాయిలో నియమించారు. ఆలయ కమిటీ కార్య నిర్వాహక అధ్యక్షుడు కె.ఎస్.ఆనంద్ రావు, ప్రధాన కార్యదర్శులుగా అల్లి మధుసూదన్ గిరి, ఇ.సుమన్ కుమార్ ముదిరాజ్, కోశాధికారులుగా బొడ్డు సాయి బాబా, వై.రాజు, ముఖ్య సలహాదారులుగా ఎస్.మల్లేషం గౌడ్, ఆలే భాగ్యలక్ష్మీ, కె.శంకర్, పాశం సురేందర్, ఆలే జితేంద్ర, కె.సదానంద్, బి.జానకీరాం, ఉపాధ్యక్షులుగా ఆలే భాస్కర్ రాజ్, కె.జ్ఞానేశ్వర్, సి.రూప్‌రాజ్, టి.వెంకటేష్ గౌడ్, మామిడి కృష్ణ, వై.రామకృష్ణ, పి.ప్రకాశ్ రాజ్, టి.మాణిక్ రావు, ఎం.ప్రకాశ్, బి.వై.శ్రీకాంత్, ఎం.రాజ్ కుమార్, గాలి ప్రభాకర్, ఎం.రమేశ్, సాంస్కృతిక సహాయ కార్యదర్శిగా అల్లి శివచంద్రగిరి, కార్యదర్శులుగా ఎం.వెంకటేశ్, బి.సదానంద్, కె.నాగరాజు, బి.రమన్, కె.రాము గౌడ్, టి.రుషికేశ్, దల్లు శివ, టి.అశోక్ గౌడ్, కె.శ్రీను, సహాయ కార్యదర్శులుగా బి.మధుకర్, డి.విజయ్ కుమార్, కె.సంతోష్, ఎం.నరేశ్, సాంస్కృతిక కార్యదర్శులుగా కె.మల్లేష్, సి.ఎం.ప్రవీణ్ రాజ్, ప్రచార కార్యదర్శులుగా టి.మేఘునాథ్, జమాల్‌పూర్ అశోక్, ముచ్చటి వినోద్, ముచ్చటి విక్రమ్‌లను ఎన్నుకున్నారు.

ఉస్మానియాలో కాలం చెల్లిన మందుల కలకలం



చికిత్స పొందుతున్న బాధితురాలు

అఫ్జల్‌గంజ్: ఉస్మానియా జనరల్ ఆస్పత్రిలో కాలం చెల్లిన (ఎక్స్‌పైరీ) మందులు ఓ రోగికి ఇచ్చిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అనారోగ్య కారణంగా వైద్యం నిమిత్తం నగరానికి చెందిన సుష్మిత(55)ను కుటుంబ సభ్యులు ఉస్మానియా ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్సల్లో భాగంగా ఆమెకు మే 13వ తేదీతో గడువు ముగిసిన డాక్సీసైక్లిన్ 100 ఎంజీ ట్యాబ్లెట్‌ను అందించారు. దీంతో ఆమెకు మొఖం, వంటిపై వాపులు వచ్చినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు. సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆస్పత్రి పరిపాలన విభాగం అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన అధికారులు వెంటనే ఆమెకు మెరుగైన వైద్య సేవలందించారు. దీనికి కారణమైన వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని, విధుల్లో అలసత్వం వీడి రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించేందుకు కృషి చేయాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.నాగేందర్ సిబ్బందికి సూచించారు.

ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న రాహుల్

చార్మినార్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏబీవీపీ కోఠి జిల్లాలోని సిటీ కళాశాల ఆధ్వర్యంలో ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్టూడెంట్ ఫర్ డెవలప్‌మెంట్ ఎస్ఎఫ్‌డీ కన్వీనర్ రాహుల్ మాట్లాడుతూ... ప్లాస్టిక్ అనర్థాలపై ఎస్ఎఫ్‌డీ ఈ సంవత్సరం అవగాహన కల్పించాలని నిర్ణయించిందన్నారు. ఎస్ఎఫ్‌డీ జాతీయ శాఖ వారం పాటు పలు రకాల కార్యక్రమాలు, ర్యాలీలు, సెమినార్, ఎకో బ్రిక్స్ అవగాహన, ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన వంటివి నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ప్లాస్టిక్ అనర్థాలపై యువత చైతన్యం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎస్ఎఫ్‌డీ జాతీయ శాఖ పిలుపునిచ్చారన్నారు. కళాశాల కార్యదర్శి సజన్, ఎస్ఎఫ్‌డీ రాహుల్, అఖిల్, విష్ణు, జిల్లా సోషల్ మీడియా శ్రీకాంత్, ఎస్ఎఫ్ఎస్ కన్వీనర్ రుషేంద్ర, అనిల్, శ్రావణ్, భవానీ, సాయిరాం, సురేశ్ పాల్గొన్నారు.

అన్నదానం



అబిడ్స్: టీఎన్జీఓస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, అసద్ అన్వార్ మెమోరియల్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. మెహిదీనవాబ్ జాంగ్ కేన్సర్ ఆస్పత్రి ఆవరణలో దాదాపు 750 రోగుల సహాయకులకు అన్నదానం, పౌష్టిక అల్పాహాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ... మానవ సేవాయే మాధవ సేవ అన్నారు. అన్నదానం చేయడంలో తనకు ఎంతో తృప్తిగా ఉంటుందన్నారు. తరచు ఈ ఆసుపత్రి వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తానని వివరించారు. కార్యక్రమంలో కె.ఆర్.రాజ్‌కుమార్, కుర్రాడి శ్రీనివాస్, ఖాలీద్ అహ్మద్, వైదిక శాస్త్రీ శంకర్, ఆసుపత్రి సభ్యులు శివకుమార్, చంద్రశేఖర్, మహ్మద్ అబ్దుల్ వహీద్, ముస్తఫా షరీఫ్ పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



సుల్తాన్‌బజార్: నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ... తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ శ్వేత మహంతికి సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నేషనల్ హెల్త్ మిషన్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు నర్సింహా, రాజేషన్ కన్నా మాట్లాడుతూ... నేషనల్ హెల్త్ స్కీమ్‌లో పనిచేస్తున్న నాల్గవ తరగతి ఉద్యోగులు 4 వేల మందికి 500 జీఓ ప్రకారం... వేతనాలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరికీ సాధారణ సెలవులు ఇవ్వాలని, ఉద్యోగులందరిని క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు.

ఎకో చాంపియన్ హాకథాన్‌లో జీఎన్ఐటీఎస్ సత్తా

గోల్కొండ: సంస్థ కళాశాల విద్యార్థినులు అన్ని రంగాలలో అగ్రగామిగా ఉంటున్నారని షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేష్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వారు ఎన్విరాన్‌మెంట్ అండ్ ప్రొటెక్షన్ ట్రెనింగ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సంయుక్త నిర్వహించిన ఎకో చాంపియన్ హాకథాన్‌లో జీఎన్ఐటీఎస్‌కు చెందిన విద్యార్థినులు 3వ బహుమతిని పొందారు. ఈ నేపథ్యంలో వారిని కళాశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి మాట్లాడుతూ... కళాశాల వివిధ విభాగాలలో అత్యుత్తమ ఫ్యాకల్టీచే విద్యాబోధన చేస్తున్నామని, అదే విధంగా వివిధ క్రీడాంశాలలో సైతం అత్యుత్తమ కోచ్‌లను నియమించామన్నారు.కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు రాకేష్ గౌడ్, బి. వికాస్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్యామలాదేవి తదితరులు పాల్గొన్నారు.

సప్త మాతృకలకు సప్త బంగారు బోనం

చార్మినార్: ఈ సారి బోనాల జాతర ఉత్సవాల్లో సప్త మాతృకలకు సప్త బంగారు బోనం కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా కన్నుల పండువగా నిర్వహించనున్నామని భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షులు ఆలే భాస్కర్ రాజ్ తెలిపారు. ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకొని ప్రతి ఏడాది ఏడు అమ్మవారి ఆలయాలను సందర్శించి బంగారు పాత్రలో నైవేద్యంతో పట్టు వస్త్రాలను అందజేయడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈసారి కూడా శివశక్తి నిషా క్రాంతితో కార్యక్రమాలను నిర్వహించనున్నామన్నారు. బుధవారం రాత్రి శివశక్తి నిషా క్రాంతికి పసుపు, బొట్టు, వాయినం ఇచ్చామన్నారు. ఈ నెల 22న గోల్కొండ జగదాంబాకు సమర్పించే మొదటి బంగారు బోనంతో కార్యక్రమాలు ప్రారంభం అవుతాయన్నారు. మీరాలంమండీ శ్రీ మహంకాళేశ్వర ఆలయ కమిటీ అధ్యక్షుడు గాజుల అంజయ్య, ప్యారసాని వెంకటేష్ పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు

గన్‌ఫౌండ్రీ: పానీపూరీ బండి మాటున గంజాయి విక్రయిస్తున్న ఓ వ్యక్తిని బుధవారం టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకృష్ణారావు సమాచారం మేరకు... అబిడ్స్‌కు చెందిన ముస్తాపూర్ ప్రశాంత్ అనే వ్యక్తి అబిడ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తాజ్‌మహల్ హోటల్ వద్ద, భారతీయ విద్యాభవన్ దగ్గర పానీపూరీ బండ్లను నిర్వహిస్తున్నాడు. పానీపూరీ బండ్ల మీద వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో గంజాయి అమ్మేందుకు పథకం వేసుకున్నాడు. అందుకు అనుగుణంగా ధూల్‌పేట్‌లో నివసించే యశ్వంత్ అయాస్ గౌతమ్ (25) అనే వ్యక్తి నుంచి రూ. 25 వేలకు కిలో గంజాయిని కొనుగోలు చేసి రూ. 45 వేలకు విక్రయించాలని నిర్ణయించుకున్నాడు. తాను అనుకున్నట్లుగా రామకృష్ణ థియేటర్ దగ్గర వినియోగదారులకు గంజాయిని విక్రయించేందుకు ప్రయత్నించాడు. ఈ విషయంపై విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు దాడులు నిర్వహించి అతని నుంచి 2.8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తు నిమిత్తం నిందితుడిని అబిడ్స్ పోలీసులకు అప్పగించారు.

పాన్ షాప్ నిర్వాహకులకు మూడు రోజుల జైలు

చాంద్రాయణగుట్ట: సమయపాలన పాటించకుండా నడుపుతున్న మూడు పాన్ షాప్ నిర్వాహకులకు నాంపల్లి న్యాయస్థానం మూడు రోజుల జైలు శిక్షను విధించింది. ఇన్‌స్పెక్టర్ ఎం.ఎ.జావిద్ సమాచారం మేరకు... స్టేషన్ పరిధిలోని మహ్మద్ ఇబ్రహీం, మహ్మద్ నదీం, ఆమర్ అహ్మద్‌లు కొన్ని రోజులుగా లైసెన్స్ సమయానికి విరుద్ధంగా పాన్ షాప్‌లను నడుపుతున్నారు. వీటిపై పెట్టి కేసు నమోదు చేసిన పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ చేసిన 9వ స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ వారికి మూడు రోజుల జైలు, రూ. 550ల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెలువరిచారు.

బాలిక మెడలోని గొలుసు చోరీకి యత్నం: ఇద్దరి రిమాండ్

గౌలిపురా: ఓ బాలిక మెడలోని గొలుసును దొంగతనానికి యత్నించిన ఒకరిని భవానీనగర్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా... బాలుడిని జువైనల్ హోమ్‌కు తరలించారు. పోలీసుల సమాచారం మేరకు... భవానీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తలాబ్‌కట్టా నషేమాన్‌నగర్‌లోని ఇదాయత్ ఫంక్షన్ హాల్ ప్రాంతంలో బుధవారం మెహిదీ ఫంక్షన్ జరుగుతుంది. అదే సమయంలో మహ్మద్‌నగర్ ప్రాంతానికి చెందిన అన్నదమ్ములు సయ్యద్ హుస్సేన్(21), ఇస్మాయిల్(17)లు మెహిదీ ఫంక్షన్ హాల్ వద్ద ఒంటరిగా కనిపించిన బాలిక మెడలోని గొలుసును దొంగతనం చేసేందుకు యత్నించారు. దీన్ని గమనించిన బాలిక బంధువులు సయ్యద్ హుస్సేన్, ఇస్మాయిల్‌లను పట్టుకొని చితకబాదారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు సయ్యద్ హుస్సేన్‌ను రిమాండ్‌కు తరలించగా... ఇస్మాయిల్ అనే బాలున్ని జువైనల్ హోమ్‌కు తరలించారు.

అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తికి జైలు శిక్ష

డబీర్‌పురా: అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తికి బుధవారం నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టు మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ్‌రావు 30 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. పోలీసుల సమాచారం మేరకు... డబీర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆశ్రఫ్‌నగర్ ఎం.ఎస్. క్రియేటివ్ కాలేజీ సమీపంలో జి.శివలింగం బుధవారం తెల్లవారుజామున 2 గంటలకు అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో సయ్యద్ యూసుఫ్ డబీర్‌పురా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు శివలింగంపై ఈ-పిట్టి కేసు నమోదు చేసుకొని నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టులో హాజరు పరచగా... మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ్ రావు శివలింగంకు 30 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. దీంతో పోలీసులు శివలింగంకు జైలుకు తరలించారు.

మోదీ నేతృత్వంలో దేశ ప్రగతి



బుజిలీ మహంకాళి ఆలయానికి బోనం ఎత్తుకెళ్తున్న భారతి బెస్

లంగర్‌హౌస్: ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో దేశం అన్నిరంగాల్లో సాధిస్తున్న అభివృద్ధిని ప్రజలందరికీ ఇంటింటికీ వెళ్లి తెలియజేయాలని భారతీయ జనతా పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు భారతి బెస్ అన్నారు. ప్రధాన మోదీ తొమ్మిది సంవత్సరాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మహాజన్ సంపర్క అభియాన్ హైదరాబాద్ పార్లమెంట్ ప్రవాస్ యోజన కార్యక్రమం లంగర్‌హౌస్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన భారతి బెస్ కార్యకర్తలతో పార్టీ సమావేశం నిర్వహించారు. అనంతరం లంగర్‌హౌస్ బుజిలీ మహంకాళీ ఆలయానికి బోనం ఎత్తుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. తదనంతరం దివంగత ప్రధాని వాజ్‌పేయ్ మిత్రుడు ఆకుల హనుమంతరావు ఇంటికి వెళ్లి ఆయన యోగక్షేమాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బాలప్రసాద్, నరసింహారెడ్డి, ముళ్ల భిక్షపతి, దేవర శ్రీనివాస్, అల్వార రవీందర్ రెడ్డి, అల్వాల ఇంద్రసేన రెడ్డి, నాగేంద్ర ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యల నివారణకు చర్యలు



బండ్లగూడ ట్రాఫిక్ పీఎస్‌లో ఏసీపీ సత్యనారాయణ

చార్మినార్: కొత్తగా ఏర్పడిన సౌత్, ఈస్ట్ జోన్‌లో ట్రాఫిక్ సమస్యలు లేకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటున్నామని ట్రాఫిక్ సౌత్, ఈస్ట్ జోన్ ఏసీపీ కె.సత్యనారాయణ తెలిపారు. సంతోష్‌నగర్, మలక్‌పేట్, చాంద్రాయణగుట్ట చౌరస్తాలలో రద్దీ అధికంగా ఉంటుందని... ఎక్కడ ట్రాఫిక్ సమస్యలు లేకుండా ముందస్తు చర్యలకు శ్రీకారం చుట్టామన్నారు. కొత్తగా ఏర్పడిన సంతోష్‌నగర్, చాంద్రాయణగుట్ట, బండ్లగూడ తదితర పోలీస్‌స్టేషన్లను ఆయన పరిశీలించి సంబంధిత సిబ్బందితో వివరాలు అడిగి తెలుసుకున్నారు.

శ్రీకాంత్‌చారికి ఉత్తమ సేవా అవార్డు



శ్రీకాంత్ చారికి అవార్డు అందిస్తున్న మినూ సలూజ

గోల్కొండ: సేవ చేసే వారికి పని చేసే సంస్థతో పాటు సమాజంలో కూడా మంచి గుర్తింపు ఉంటుందని గ్లెండెల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ మినీ సలూజా అన్నారు. గ్లెండెల్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో అడ్మిన్‌గా పని చేస్తున్న బి.శ్రీకాంత్ చారికి ఆమె బుధవారం ఉత్తమ సేవా అవార్డును అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... క్రమశిక్షణకు మారుపేరుగా శ్రీకాంత్ చారికి గుర్తింపు ఉందన్నారు. అతని సేవా భావం, క్రమశిక్షణ, అంకిత భావాలను తోటి ఉద్యోగులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఇటువంటి అవార్డులు బాధ్యత పెంచడమే కాకుండా మరింత క్రమశిక్షణతో పని చేయడానికి ప్రోత్సాహనిస్తుందని శ్రీకాంత్‌చారి అన్నారు.

చేపల పెంపకానికి ప్రభుత్వ ప్రోత్సాహం

చైర్మన్ పిట్టల రవీందర్



విజయనగర్‌కాలనీ: చేపల పెంపకాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రోత్సహించడంతో చేపల ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని తెలంగాణ మత్స్య సహకార సంఘాల సమాఖ్య చైర్మన్ పిట్టల రవీందర్ అన్నారు. విజయనగర్‌కాలనీ శాంతినగర్ రాష్ట్ర మత్స్యశాఖ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మూడు సంవత్సరాల తర్వాత నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించే చేపప్రసాదం పంపిణీ కార్యక్రమంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. చేప ప్రసాదం కోసం అవసరమైన కొరమీను చేపపిల్లలను సేకరించి అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశాల మేరకు మత్స్యశాఖ అభివృద్ధే ధ్యేయంగా అమలుపరుస్తున్న కార్యక్రమాలను వివరించారు. ప్రత్యేక తెలంగాణ సాధించుకున్న తర్వాత చేపల ఉత్పత్తి రెట్టింపు అయ్యిందన్నారు. పెరిగిన ఉత్పత్తికి అనుగుణంగా వినియోగాన్ని పెంచేందుకు రుచి, ఆరోగ్యకరమైన చేపల వంటకాలను ప్రజలకు చేరువ చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. పెరిగిన మత్స్య సంపదను గిట్టుబాటు ధరకు అమ్ముకునేందుకు సబ్సిడీపై మత్స్యకారులకు వివిధ రకాల సదుపాయాలు కల్పిస్తున్నట్లు వివరించారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్టాల్స్‌ను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మత్స్యశాఖ కమిషనర్ లచ్చిరామ్ భూకియా, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లయన్ ప్రమోద్‌కు సన్మానం



జియాగూడ: విద్య, వైద్య, ఆరోగ్య యూత్ క్రీడలు కమ్యూనిటీ అభివృద్ధిలో 50 సంవత్సరాలుగా సేవలందిస్తున్న గోపీశెట్టి ప్రమోద్ అభినందనీయుడని లయన్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ గవర్నర్ టి.రాజేందర్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు బుధవారం లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ రాయల్ కార్యాలయంలో లయన్ ప్రమోద్‌ను విశిష్ట సేవలందించినందుకు సన్మానించి సత్కరించారు. రాయల్ కార్యదర్శి లయన్ ఆకుల రవీందర్‌రావు, అధ్యక్షుడు లయన్ వాయిల శ్రీనివాసరావు, కోశాధికారి లయన్ తోట శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.